## కేయూ దూర విద్యా కేంద్రం సంయుక్త సంచాలకుడిగా గోపీనాథ్

హనుమకొండ చౌరస్తా, మే 16 : కేయూ దూర విద్యాకేంద్రం సంయుక్త సంచాలకుడిగా మైక్రోబయాలజీ విభాగ ఒప్పంద అధ్యాపకుడు బీవీ గోపీనాథ్‌ను నియమిస్తూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గోపీనాథ్ కేయూలో 2010వ సంవత్సరంలో పార్ట్ టైం అధ్యాపకుడిగా చేరారు. 15కి పైగా పత్రాలు వివిధ జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో సబ్మిట్ చేశారు. 2005లో రాజీవ్‌గాంధీ నేషనల్ ఫెలోషిప్‌కు ఎంపికైన గోపీనాథ్ యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో దూరవిద్యా సెల్ కోఆర్డినేటర్‌గా, మైక్రో బయాలజీ విభాగ ఇన్‌చార్జి హెడ్‌గా పనిచేశారు.



ఫాంపాండ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

## భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలి

**అవగాహన కల్పించాలి ■ వాటర్ సెంట్రల్ బోర్డు శాస్త్రవేత్త డాక్టర్ గౌతమ్**

వర్ధన్నపేట, మే 16: భావితరాల మనుగడ కోసం విధిగా ప్రతి ఒక్కరూ భూగర్భ జలాల పెంపు కోసం కృషి చేయాలని కేంద్ర వాటర్ బోర్డు శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్.గౌతమ్ సూచించారు. దక్షిణ భారతదేశంలో ఆరు గ్రామాలకు కేంద్ర ప్రభుత్వం భూగర్భ జలాల పెంపు కోసం ఐదు గ్రామాలను ఎంపిక చేసింది. ఇందులో ఇల్లందకు అవకాశం దక్కింది. దీంతో అధికారులు గురువారం గ్రామంలోని పలు ప్రాంతాలను సందర్శించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈజీఎస్, ఐకేపీ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా గౌతమ్ మాట్లాడుతూ వర్షాకాలంలో నీరు భూమిలోనే ఇంకేలా ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలని కోరారు. ప్రధానంగా రైతులు వ్యవసాయ భూముల్లో తప్పకుండా ఫాంపాండ్‌లు నిర్మించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతేకాకుండా వాగులు, కాల్వలపై విధిగా చెక్‌డ్యాంలు నిర్మించేలా అధికారులు చూడాలన్నారు. అలాగే, ప్రజలు ఇంటి ఆవరణల్లో ఇంకుడుగుంతలు నిర్మించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు కేంద్రం ఇస్తున్న ప్రోత్సాహకాలను వివరించి విధిగా ఫాంపాండ్‌లు, ఇంకుడుగుంతలు, ఫిష్‌పాండ్‌లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో కౌసల్యాదేవి, ఎంపీడీవో వెంకటరమణ, తహసీల్దార్ విజయ్‌సాగర్, ఈజీఎస్ ఏపీవో నాగేశ్వర్, ఏపీఎం వేణు తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నర్సంపేట రూరల్, మే 16: నర్సంపేట పట్టణం ద్వారకపేటలోని వేణుగోపాల-వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్ గంధం నరేందర్‌గుప్తా, ప్రధాన అర్చకుడు వెంకటాచార్యులు, శ్రీధరాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

## మృతుడి కుటుంబానికి పెద్ది పరామర్శ

నర్సంపేట రూరల్, మే 16: నర్సంపేట పట్టణం ద్వారకపేట 7వ వార్డుకు చెందిన మాజీ వార్డు సభ్యుడు మొగిలి నర్సయ్య(65) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని నర్సయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఖానాపురం ఎంపీపీ ప్రకాశ్‌రావు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటనారాయణగౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రవి, రమేశ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న పెద్ది

## ఆర్థిక సాయం అందజేత

నర్సంపేటరూరల్, మే 16: ముగ్దుంపురం గ్రామానికి చెందిన బదావత్ రాజేందర్ (32) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం బాధిత కుటుంబాన్ని ప్రజాప్రతినిధులు, నాయకులు, తండాపెద్దలు పరామర్శించారు. తండాపెద్ద మనిషి వెంకట్‌నాయక్, మాజీ ఉప సర్పంచ్ చాందావత్ తిరుపతినాయక్ ఆధ్వర్యంలో దాతలు రూ. 30 వేల ఆర్థిక సాయం, 50 కిలోల బియ్యం అందించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ ఇస్లావత్ గోపి, ఈర్య, అంజన్‌కుమార్, నరన్‌నాయక్ పాల్గొన్నారు.

## వరంగల్ జిల్లాలో భారీ వర్షం

ఖిలావరంగల్, మే 16: వరంగల్ జిల్లాలో గురువారం సాయంత్రం నుంచి గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. అక్కడక్కడా పిడుగులు పడ్డాయి. విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, అవసరం ఉంటేనే ప్రజలు బయటకు రావాలని వాతావరణ శాఖ సూచించింది. నగరంలోని పలు ప్రాంతాల్లో వరద నీరు రోడ్లపై ప్రవహించింది. అండర్ బ్రిడ్జి ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిల్వడంతో పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అరగంట సమయంలోనే గీసుగొండ మండలంలో 33.8 మిల్లీ మీటర్లు, ఖిలా వరంగల్‌లో 33.5, వరంగల్‌లో 32.3, వర్ధన్నపేటలో 20.0, రాయపర్తిలో 15.5, చెన్నారావుపేటలో 11.0, సంగెంలో 4.2 మిల్లీ మీటర్ల వర్షపాతం కురిసినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, KATTA VANI (New Name), previously called ANITHA BETHI (Old Name), and residing at H.No. 2-10-893/302, 4th Floor, PJR Towers, SBH Colony, Near: Telanganga Chowrasta, Waddepally, Hanamkonda, Hanumakonda Dist.- 506370, T.S., India, and solemnly declare.

CHANGE OF NAME
I, GUNJALA LAXMI (New Name), previously called SREELAKSHMI K (Old Name), and residing at H.No. 2-4-1206/6/A, Vidyanagar, Hanamkonda Mandal, Hanumakonda Dist.-506001, T.S., India, and solemnly declare.

CHANGE OF NAME
I, KATTA VENKATESWER REDDY, S/o. KATTA INDRASENA REDDY (New Name), previously called K VENKATESHWARA REDDY (Old Name), and R/o. H.No. 2-10-893/302, 4th Floor, PJR Towers, SBH Colony, Near: Telanganga Chowrasta, Waddepally, Hanamkonda, Hanumakonda Dist.- 506370, T.S., India. and solemnly declare. both are same.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556 9182777557
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

# వంతెన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, చిత్రంలో అధికారులు

హనుమకొండ, మే 16 : నయింనగర్ నాలాతో పాటు వంతెనల నిర్మాణ పనులను జూన్ 15 నాటికి పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ రాధికాగుప్తాతో కలిసి నయింనగర్ నాలా నిర్మాణ పనుల పురోగతి, చేపట్టాల్సిన చర్యలపై రెవెన్యూ, జీడబ్ల్యూఎంసీ, టౌన్ ప్లానింగ్, ఇరిగేషన్, సర్వే విభాగ అధికారులతో కలెక్టర్ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికలు ముగిసినందున ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే పరిష్కరించి నాలుగైదు రోజుల్లో నిర్మాణ పనులను ఎక్కడా ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలన్నారు. మూడు రోజుల్లో సర్వే పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే అనంతరం ఈ పనులపై మరోసారి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్డీవో వెంకటేశ్, జీడబ్ల్యూఎంసీ ఈఈ రాజయ్య, టౌన్ ప్లానింగ్ అధికారి వెంకన్న, ఇరిగేషన్ ఈఈ ఆంజనేయులు పాల్గొన్నారు.

### ఈ నెల 20లోగా పనులు పూర్తి చేయాలి

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను ఈ నెల 20 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో కాజీపేట, హనుమకొండ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, టాయిలెట్లు, మైనర్ రిపేర్లు ఈ నెల 20వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఈవో అబ్దుల్ హై, ఈఈ సంజయ్ కుమార్, డీఈలు సంతోష్ బాబు, రవికుమార్, శివానంద్ పాల్గొన్నారు.

## అమ్మ అదర్శ పాఠశాలల పనుల్లో వేగం పెంచాలి

**గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే**

వరంగల్ : అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. గురువారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో జిల్లాలోని అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్‌పర్సన్లు, ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పనులు ప్రారంభించని పాఠశాలలో వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం ఈ పాఠశాలలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు 25 శాతం నిధులను మంజూరు చేయాలన్నారు. మైనర్ పనులు పూర్తి చేసిన వారికి వెంటనే బిల్లులు చెల్లించాలని సూచించారు. బల్దియా ఇంజినీర్లు సాంకేతిక సహకారం అందిస్తారన్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలలు ప్రారంభమయ్యే సమయానికి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో టీపీఆర్‌వో కోలా రాజేశ్‌కుమార్ గౌడ్, ఈఈలు రాజయ్య, సంజయ్‌కుమార్, డీఈలు రవి కుమార్, సంతోష్‌బాబు, శివానంద్, అజ్మీరా శ్రీకాంత్, టీఎంసీ రమేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



నిరసన వ్యక్తం చేస్తున్న జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, ఎంపీటీసీలు

## నల్లబెల్లి మండల సభ బహిష్కరణ

నల్లబెల్లి, మే 16: కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సభ్యులు మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం బహిష్కరించారు. ఎంపీపీ ఊడుగుల సునీత అధ్యక్షతన సభను ఏర్పాటు చేశారు. జడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్నతో పాటు ఎంపీటీసీలు హాజరయ్యారు. సభను ఎంపీడీవో నర్సింహమూర్తి ప్రారంభిస్తున్న క్రమంలో సభ్యులు నిలబడి భూటకపు వాగ్దానాలతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్నదని, దీన్ని నిరసిస్తూ సభను బహిష్కరిస్తున్నట్లు సభ్యులు ప్రకటించారు. అనంతరం పెద్ది స్వప్న మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతన్నలను కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచుతున్నదని ధ్వజమెత్తారు. యాసంగిలో సాగు చేసిన పంటలకు సాగు నీరు ఇవ్వకపోవడంతోపాటు కనీసం ప్రజలకు తాగు నీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అలాగే, వరికి రూ. 500 బోనస్ ఇవ్వకపోవడం హేయమన్నారు. కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలంటే పట్టభద్రుల ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు ప్రజలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గందె శ్రీలత, ఎంపీటీసీలు లక్ష్మి, రవీదంర్‌రావు, జన్ను జయరావ్, దేవూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పత్తిని మద్దతు ధరతో కొనుగోలు చేయాలి

కాశీబుగ్గ, మే 16: సీసీఐ పత్తిని క్వింటాల్‌కు రూ.7020తో కొనుగోలు చేయాలని రైతు సంఘం నాయకులు శ్రీనివాస్, రాజయ్య డిమాండ్ చేశారు. గురువారం సీసీఐ మేనేజర్ అర్జున్ దవేకు వినతిపత్రం అందజేశారు. పత్తి వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండడంతో రైతులకు పెట్టుబడి రావడం లేదన్నారు. హంసారెడ్డి, సిరుల రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

## 'ప్లాంట్ యజయానిపై చర్యలు తీసుకోవాలి'

చెన్నారావుపేట, మే 16: పాతముగ్దుంపురంలోని వాటర్ ప్లాంట్ యజమాని వీరస్వామి పై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ననుమాస కుమారస్వామి తెలిపారు. ఆ వాటర్ ప్లాంట్ నుంచి వచ్చే వ్యర్థ నీరు రోడ్డుపై పారుతుండడంతో గుంతలో చేరి దుర్వాసన వస్తున్నదన్నారు. అలాగే, దోమలు పెరిగి ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

## 'గీత కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలి'

ఖానాపురం, మే 16: గీత కార్మికుడి మృతికి కారణమైన వారి నుంచి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీస్‌స్టేషన్ ఎదుట గురువారం బైఠాయించి నిరసన తెలిపారు. బుధరావుపేటకు చెందిన రావుల వెంకన్న బుధవారం రాత్రి కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాకున్నా దవాఖానలో అడ్మిట్ అయ్యారని, బాధిత కుటుంబానికి న్యాయం చేయకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఎస్సై రఘుపతి నిరసనకారులతో మాట్లాడారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని, న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు.

## 'రోడ్లపై మక్కజొన్న ఆరబోయొద్దు'

దామెర, మే 16 : రోడ్లపై మక్కజొన్న ఆరబోయొద్దని ఎస్సై కొంక అశోక్ కోరారు. గురువారం ల్యాదెళ్లకు వెళ్లే రోడ్డుపై మక్కజొన్న ఆరబోసిన రైతులతో ఎస్సై మాట్లాడారు. రోడ్లపై వరి, మక్కజొన్న ఆరబోయడం వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురువుతున్నారని, ఖాళీ ప్రదేశాల్లో ఆరబోసుకోవాలని సూచించారు. రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## హనుమాన్ దీక్షాపరుడి ఆత్మహత్యాయత్నం

**కాంగ్రెస్ నాయకుడి వేధింపులే కారణం**

కాశీబుగ్గ, మే 16: వరంగల్ 3వ డివిజన్‌కు చెందిన ఓ కాంగ్రెస్ నాయకుడి వేధింపులు తట్టుకోలేక హనుమాన్ దీక్షాపరుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. 3వ డివిజన్ ఆరెపల్లి గ్రామానికి చెందిన బుద్దె చంద్రశేఖర్ హనుమాన్ దీక్ష తీసుకున్నాడు. పోలింగ్ రోజు బూత్ వద్దకు వెళ్లిన చంద్రశేఖర్‌ను స్థానిక కాంగ్రెస్ నాయకుడు, హనుమకొండ పీఏసీఎస్ మాజీ చైర్మన్ బుద్దె పెద్దన్న ఇక్కడకు ఎందుకు వచ్చావని దుర్భాషలాడాడు. మరోమారు 15న కూడా తిట్టడంతో మనస్తాపం చెందిన చంద్రశేఖర్ నిద్రమాత్రలు వేసుకొని అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన స్థానికులు అతడిని వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. ప్రస్తుతం చంద్రశేఖర్ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అతడిని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ పరామర్శించారు. ఆయన వెంట బుద్దె శ్రీనివాస్, దినేశ్, రాజేశ్, సాంబయ్య, రవీందర్‌రావు, జితేందర్, సతీశ్, అనిల్ ఉన్నారు. కాగా, బుద్దె పెద్దన్నపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితుడి భార్య స్రవంతి ఎనుమాముల పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## ఇరుకు క్యాజువాలిటీతో ఇక్కట్లు

పోచమ్మమైదాన్, మే 16: వరంగల్ ఎంజీఎం దవాఖానలో క్యాజువాలిటీ ఇరుకుగా ఉండడంతో పేషంట్లకు ఇక్కట్లు తప్పడం లేదు. అత్యవసర సేవల కోసం పేషంట్లు ఎక్కువగా వస్తుండడంతో సరైన స్థలం లేక వైద్య సిబ్బంది సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఎంజీఎం ను 1250 పడకల వరకు విస్తరించినా వైద్య సదుపాయాలు అంతంతమాత్రంగా అందుతున్నాయి. క్యాజువాలిటీని విస్తరించాలనే అధికారుల ఆలోచనలు కార్యరూపం దాల్చడం లేదు. 108 అంబులెన్స్‌ల ద్వారా తీసుకొచ్చిన రోగులతో క్యాజువాలిటీ స్థలం సరిపోవడం లేదు. దీంతో వైద్య సేవలందించడానికి డాక్టర్లు, వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతుంటారు. ఇదే సమయంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు రావడంతో క్యాజువాలిటీ మరింత ఇరుకుగా తయారై కిక్కిరిసిపోతున్నది. మంత్రులు స్పందించి వైద్య సేవలను మెరుగుపర్చాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఇరుకుగా ఉన్న క్యాజువాలిటీలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఐనవోలు, మే 16: రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి చెందిన ఘటన మండలంలో జరిగింది ఎస్సై అనిల్‌కుమార్ కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం, సిరిసనపల్లికి చెందిన దిగ్గిశెట్టి వినయ్‌కుమార్ గ్రామాల్లో నిత్యావసర సరుకులు విక్రయిస్తూ వర్ధన్నపేట మండలం ఇల్లందలో ఏడాదిగా ఉంటున్నాడు. గురువారం అతడు తన బైక్‌పై సిరిసనపల్లికి వెళ్తుండగా పంథిని శివారు లక్ష్మీపురం క్రాస్ వద్ద ఇసుక ట్రాక్టర్లు ఎదురుగా వస్తున్నాయి. వాటిని తప్పించే క్రమంలో హనుమకొండ నుంచి వర్ధన్నపేట వైపు వెళ్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. వెంటనే అతడిని అంబులెన్స్‌లో ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# డెంగీ లక్షణాలపై అవగాహన ఉండాలి

**డీఎంహెచ్‌వో సాంబశివరావు**

వరంగల్, మే 16 : ప్రాణాంతక డెంగీ జ్వరం లక్షణాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో సాంబశివరావు అధికారులకు సూచించారు. జాతీయ డెంగీ నివార ణ దినోత్సవం సందర్భంగా గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్, జీపీల సహకారంతో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది డెంగీ లక్షణాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. జనవరి 9 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 9 డెంగీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో మదన్‌మోహన్‌రావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమాశ్రీ, వైద్యులు హిమబిందు, ఇఫ్తాకర్ అహ్మద్, జిల్లా మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి, డీపీవో శ్రీనివాస్, లింగమూర్తి, పరంజ్యోతి, రమేశ్, జ్యోతి, శిరీష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సాంబశివరావు

# టాలెంటే కొలువుల సాధనకు వారధి

**ప్రాంగణ నియామకాల్లో కేయూ వీసీ రమేశ్**

హనుమకొండ చౌరస్తా, మే 16 : కొలువుల సాధనకు వారధి నైపుణ్యాలు మాత్రమేనని కేయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ అన్నారు. విశ్వవిద్యాలయ మహిళా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఎస్.ఎల్. సౌజన్య అధ్యక్షతన వరంగల్‌లోని మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పోటీ ప్రపంచంలో నిలబడాలంటే నైపుణ్యాలు అవసరమన్నారు. మారుతున్న టెక్నాలజీకి తగ్గట్టుగా నవీన నైపుణ్యాలపై దృష్టి పెట్టాలని, కేవలం పుస్తకాలు, తరగతి గదికి పరిమితం కావద్దని సూచించారు. 120 మంది విద్యార్థినులు పాల్గొనగా 80 మంది విద్యార్థినులు షార్ట్‌లిస్టు అయినట్టు వీరికి 17న ఇంటర్వ్యూ నిర్వహిస్తామని, ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్, వరంగల్‌లో పనిచేయాల్సి ఉంటుందని, వీరికి జెన్ ప్యాక్ట్, హెచ్ నెక్ట్స్, పాత్రా, థ్రెట్స్, ఎస్‌ఆర్‌బీసీ నియామకాలు ఉంటాయన్నారు. నేడు కూడా ప్రాంగణ నియామకాలు కొనసాగుతాయని ప్రిన్సిపాల్ సౌజన్య తెలిపారు. డాక్టర్ మధుశ్రీ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ కే కవిత, డాక్టర్ ఏ రవీందర్, డాక్టర్ వీ కుమారస్వామి, డాక్టర్ ఎన్ జ్యోత్స్న, వీ రజితతో పాటు మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నట్లు ఆమె తెలిపారు.




కార్యక్రమంలో మాట్లాడుతున్న కేయూ వీసీ రమేశ్



సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

## రోజూ స్ట్రాంగ్ రూంలను పరిశీలించాలి

**24 గంటలూ రక్షణ ■ రిటర్నింగ్ అధికారి, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య**

కాశీబుగ్గ మే 16: వరంగల్ ఎనుమాముల మార్కెట్ పరిధిలోని స్ట్రాంగ్ రూంలను ఏఆర్వోలు రోజూ పరిశీలించాలని రిటర్నింగ్ అధికారి, వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. గురువారం ఆమె స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. స్ట్రాంగ్ రూంలకు సంబంధించిన లాగ్‌బుక్, సీసీ కెమెరాల పర్యవేక్షణకు సంబంధించిన వాచ్‌రూంలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్ట్రాంగ్ రూంలకు పక్కన ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేసి, ఆయా స్ట్రాంగ్ రూంల సీసీటీవీ కవరేజ్ ఎల్‌ఈడీ స్క్రీన్లపై ప్రదర్శిస్తున్నామన్నారు. పారదర్శకంగా, కట్టుదిట్టమైన భద్రతతో జూన్ 4 వరకు దృశ్యాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా చర్యలు చేపట్టామన్నారు. స్ట్రాంగ్‌రూంల వద్ద 24 గంటలూ సాయుధ బలగాల రక్షణలో ఉంటుందన్నారు. కలెక్టర్ వెంట డీటీ రంజిత్, పోలీసు అధికారులు, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

గీసుగొండ : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులను జూన్ 10 లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను సూచించారు. కోనాయిమాకుల మండల సమాఖ్యలో ఏకరూప దుస్తుల తయారీతో పాటు జాన్ పాక, ఉర్దూ మీడియం, గుంటూరుపల్లి, బీఎస్ తండాలోని ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. విద్యార్థులకు పాఠశాల ప్రారంభం రోజు దుస్తులను అందించాలని సూచించారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ భవనాలకు మైనర్ రిపేర్ పనులకు ఇప్పటికే నిధులు కేటాయించినట్లు తెలిపారు. నిధులు సరిపోకపోతే అదనపు నిధులు మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల తీర్మానం మేరకు ఏఈలు ప్రతిపాదనలు పంపాలని, అందుకు అనుగుణంగా నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఈవో వాసంతి, తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీవో కృష్ణవేణి, మండల ప్రత్యేకాధికారి దేవేందర్, ఏఈ సుధాకర్, ఏపీఎం సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

## డీటీడబ్ల్యూవో అక్రమాలపై విచారణ జరిపించాలి

హనుమకొండ, మే 16 : జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ లంబాడా హక్కుల పోరాట సమితి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. డీటీడబ్ల్యూవో జిల్లాలో విధుల్లో చేరినప్పటి నుంచి గిరిజన సంక్షేమ శాఖను భ్రష్టు పట్టించిందన్నారు. జిల్లా అధ్యక్షుడు బానోత్ గోవింద్ నాయక్, గుగులోత్ రమేశ్ నాయక్, భాస్కర్ నాయక్, మోహన్ నాయక్ ఉన్నారు.

## డెంగీ నివారణలో భాగస్వాములు కావాలి

గిర్మాజీపేట, మే 16: డెంగీ వ్యాధి నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డీఎంహెచ్‌వో వెంకటరమణ పిలుపునిచ్చారు. జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా డీఎంహెచ్‌వో గురువారం తన కార్యాలయంలో వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం అధికారి సుధార్‌సింగ్ మాట్లాడుతూ డెంగీ వ్యాధి నివారణలో భాగంగా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. దీంతో దోమల లార్వాను నిర్మూలించొచ్చన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సత్యేంద్రనాథ్, ప్రోగ్రాం అధికారి గోపాల్‌రావు, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, వైద్య సిబ్బంది సోమేశ్వర్, కిరణ్, ప్రకాశ్‌రెడ్డి, కుమారస్వామి, చక్రపాణి పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ నిలిపివేత

చెన్నారావుపేట, మే 16: మండలంలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనున్నట్లు డీఈఈ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మరమ్మతు చేస్తున్నందున ఉప్పరపల్లి 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని గ్రామాలకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

## అవార్డుల కోసం దరఖాస్తులు

ఖిలావరంగల్, మే 16: ఆపదలో ఉన్న బాల బాలికలను రక్షించిన బాలలు, స్వచ్ఛంద సంస్థల బాధ్యుల నుంచి ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, నూతన ఆవిష్కరణలు, అసాధారణ ప్రతిభా పాటవాలు, ఆటలు, కళలు, సాహిత్యం, సామాజిక సేవ, ధైర్య సాహసాలు తదితర అంశాల్లో అవార్డులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఐదేళ్ల నుంచి 18 ఏళ్లలోపు బాలబాలికలు, స్వచ్ఛంద సంస్థలైతే ఏడేళ్లు ఆపైన బాల బాలికల తరపున పని చేస్తూ వారి జీవితాల్లో మార్పు తీసుకొచ్చిన వారు జూలై 31లోగా అవార్డు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## పోగొట్టుకున్న బ్యాగ్ అప్పగింత

ఖిలావరంగల్, మే 16: పోగొట్టుకున్న బ్యాగ్‌ను తిరిగి బాధిత మహిళలకు గురువారం మిల్స్‌కాలనీ పోలీసులు అప్పగించారు. సీఐ మల్లయ్య కథనం ప్రకారం.. బెల్లంపల్లికి చెందిన దుర్గం రాధ తన బంధువులతో కలిసి గురువారం ఖిల్లాను సందర్శించారు. తిరిగి వెళ్లే క్రమంలో బ్యాగ్ కనిపించకపోవడంతో మిల్స్‌కాలనీ పోలీసులను ఆశ్రయించింది. ఎస్సై గోవర్ధన్, హోంగార్డు సాంబయ్య ఏకశిల పార్కులో వెతుకగా ఓ బెంచీ వెనకాల బ్యాగ్ లభించింది. దీంతో బ్యాగును ఆమెకు అప్పగించారు. అందులో రూ.6 వేల నగదు, బయోమెట్రిక్ మిషన్, విలువైన పత్రాలు ఉన్నాయి.

## ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

పోచమ్మమైదాన్, మే 16: పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఆర్య వైశ్య విద్యార్థినీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఆర్యవైశ్య వాసవీమాత పరపతి సంఘం ఎంజీ రోడ్డు ఆధ్వర్యంలో మట్టెవాడలోని వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం రాత్రి సంఘం అధ్యక్షుడు ఇరుకుల్ల రమేశ్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. దేవస్థాన అర్చకులు రామాచారి, కృష్ణమాచారి, ప్రతినిధులు అకినెపల్లి సత్యనారాయణ, బెజుగం రజినీకాంత్, వీ రమేశ్, కుంచం వీరభద్రరావు, తోట నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

## 13 మందికి జరిమానా

పోచమ్మమైదాన్, మే 16: వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 13 మందికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి గురువారం రూ. 13,900 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ కె.శ్రీధర్ తెలిపారు. అలాగే, లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఒకరికి రూ. 500 జరిమానా విధించారన్నారు.

## శోభాయాత్రను విజయవంతం చేయాలి

గిర్మాజీపేట, మే 16: వాసవీమాత జయంతిని పురస్కరించుకొని శనివారం నిర్వహించనున్న అమ్మవారి శోభాయాత్రను ఆర్యవైశ్యులు విజయవంతం చేయాలని గందె నవీన్, ఆర్యవైశ్య మిత్ర బృందం అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ కోరారు. గురువారం సంఘం సభ్యుల ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. శనివారం ఉదయం 5 గంటలకు శోభాయాత్ర స్టేషన్‌రోడ్‌లోని పోచమ్మ ఆలయం వద్ద ప్రారంభం అవుతుందన్నారు.

## చట్టాలకు లోబడి వ్యాపారం చేయాలి : డీసీపీ

ఖిలావరంగల్, మే 16: చట్టాలకు లోబడి వ్యాపారం చేస్తే పోలీసుల నుంచి ఎలాంటి ఇబ్బందులు ఉండవని డీసీపీ రవీందర్ అన్నారు. గురువారం వరంగల్ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల డీలర్లకు డీఏవో ఉష అధ్యక్షతన అవగాహన కల్పించారు. రైతులకు అందించే విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల సరఫరాలో అవకతవకలకు తావివ్వొద్దన్నారు. ఏడీఏ కే నగేశ్, ఏవో విజ్ఞాన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ రవీందర్